# ఫస్ట్ కేస్

"ఆనందరావు కేం తక్కువ ?" అని ఆనందరావే అడిగే పరిస్థితిలో వున్నాడు. తల్లికడుపులో పిల్లలా అతని కేవీ తక్కువలేదు. అన్నీ ఎక్కువగానే వున్నాయి. అతనికి డబ్బెక్కువ. అందం ఎక్కువ. ఆరోగ్యం ఎక్కువ. చదువు మాత్రం ఎంబీ. బియస్సు కెక్కువకాదు.

ఎం. బీ. బీ. యెస్సు ఆఖరి పరీక్ష మొన్ననే పేసైన తను జీవితం చాలా సాధించినట్టు ఫీలయ్యేడు. సర్జరీలో గోలుమెడల్ కొట్టేసేడు. ఐదేళ్ళు టెన్నిసులో ఫస్టుప్రైజు కొట్టేసేడు. అనసూయ హృదయం కొట్టేసేడు. ఒకనాడు ఆలస్యంగా సర్వ్ చేసినందుకు హాస్టలు సెర్వెర్ని కొట్టేసేడు.

అంచేత అతను నాకేం తక్కువని తన్నితను నిందించుకోవడం తప్పుకాదు. మనిషి క్కావలసినవన్నీ అతనికున్నాయి. అతని సూట్లు టెర్లిన్వి. అతని సిగరెట్లు ఇంగ్లీషువి. అతని కారు ఫ్రెంచిది. అతని వూహాలు అమెరికన్వి.

అతనితల్లి సాధ్వి. భర్తురాలు. అతని తండ్రి ధన వంతుడు. పారిశ్రామికవేత్త. అతనిపేరు జగపతి, ఎముకలు గుండచేసే మిల్లు దగ్గర్నుంచి, కాలిస్తే కేన్సరొచ్చే సిగరెట్లు తయారుచేసే ఫ్యాక్టరీవరకు, అతని కనేకరకాల కంపెనీ లున్నాయి. కేన్సరు మందుల లగాయతు కురుపు లాయింటు మెంటువరకు తయారుచేసే మందుల ఫ్యాక్టరీ పెడదామని అతని కోరిక. అతనికి, ఆమెరికన్ కారుతోసహా ఆరు కార్లు న్నాయి. వేసవికి ఊటీలో బంగళా, సిమ్లాలో కాటేజీ వున్నాయి. అతని స్నేహితుల్లో మూడులక్షలకు తక్కువున్న వాడు ముష్టివెధవతో సమానం. ఒక్క ఇండియన్ కారే వున్నవాడింకా హీనం. రాజకీయ రంగంలోనూ, యితర రంగాల్లోనూ వున్నవాళ్ళని చాలామందిని అతనికి తెలుసు. తెలిసినంతమందినీ ఉపయోగించుకోవడం అతనికి బాగా తెలుసు. సోషలిస్టు మొదలు, స్వతంత్రపార్టీ వరకు అనేక పార్టీల నాయకులు అతనింట్లోనే బసచేస్తారు. వాళ్ళతన్ని స్నేహితుడుగా, మంచి హోస్టుగా చూస్తారు. అతనుమాత్రం వాళ్ళని నేటి నాయకులుగానో, రేపటి నాయకులుగానో మాత్రం చూడగలుగుతాడు.

ఊరికి బోలెడుదూరంలో వున్నతనిల్లు స్వర్గనుంచి జారిపోయిన మనోహర హర్మ్యంలా వుంటుంది. దాని ఆవ రణలో రెండు టెన్నిసు కోర్టులున్నాయి. ఒక స్విమ్మింగ్పూ లుంది. స్విమ్మింగుపూల్లో నీలాలు పొదిగేరా అన్నంత నీలిగా వుంటాయి దానిలో నీళ్ళు. ఆ యింట్లో 16 ఎం. ఎం. థియే

టరుంది. ప్రసిద్ధికెక్కిన శిల్పసుందరులెందరో ప్రొవొకేటివ్‌గా, బట్టలు జారవిడుస్తూ, ఆ యింట్లో అన్నిమూలల్లో నిలబడుంటారు. నళినీ చౌదరీవేసి, యీ మధ్యనే పదివేల కమ్మిన తైలవర్ణ చిత్రం "బిక్షుకి" సెంట్రల్ హాల్లో ఎదురుగోడకి వేలాడుతూ వుంటుంది (స్రియలిస్టిక్ పెయింటిం గవటంవల్ల అది బిక్షుకో, బర్మా షెల్పంపో ఎవరికీ తెలియదు) ఆ యింట ఆవరణలో మర్యాదకు భంగంలేనంత దూరంలో గెస్టులకి రోజ్ కాటేజుంది. ఆయింటి ఆరో అంతస్తుమీంచి చూస్తే, ఆ యింటిచుట్టూవున్న లాన్ పచ్చతివాసీలాగా, ఆ లానులో కుండీల్లోవున్న పూలమొక్కలు ఆ తివాసీలోని పూలలాగా కనిపిస్తాయి. అదే అంతస్తునుండి దూరంగాచూస్తే చాలా దూరంగా, చివికిపోయిన చిన్న గుల్ల గడ్డిమేటల్లా గుడిసెలూ, వాటిముందు తోకలమీద నడుస్తున్న నల్లపురుగుల్లా కూలీలు కన్పిస్తారు.

ఆ యింట్లో షర్బతు మొదలు, షాంపేనువరకూ అన్ని రకాల పానీయాలూ రిఫ్రెజిరేటర్లలో వుంటాయి. ఆక్స్‌టంగ్ (Ox tongue) మొదలు అల్లంమురబ్బావరకు అన్నీ టిన్నుల్లో వుంటాయి. అవి తాగడానికీ తినడానికీ చాలామందొస్తారు. సినిమాస్టార్లు నారాయణ్రావూ అనసూయా ఆ వూరొచ్చినప్పుడాయింట్లోనే బసచేస్తారు. చాలామంది అధికార్లుకూడా ఆ యింటి కొచ్చి పోతుంటారు. "కలకటేరు మా యింటికొచ్చేననుకో" అని ఆ యింటి తోటమాలి గొప్ప చెప్పుకుంటూ వుంటాడు.

ఆ యింటికి రానివాళ్ళు అడుక్కు-తినేవాళ్ళూ, ఒళ్ళు మ్మనుకునే వాళ్ళూ మాత్రమే:

◆ ◆ ◆

ఆనందరావు యిటుపై నేం చేయాలి? అతను ప్రాక్టీసు పెడితే డబ్బుకీ, రిచ్ పేషెంట్లకీ కొదవుండదు. అభినేత్రి అన సూయ తన ఆస్త్మాకి అతనిదగ్గరే మందు పుచ్చుకుంటుంది. హీరో నారాయణరావు అతనిదగ్గరే గ్రేస్ట్రిక్టమీ చేయించు కుంటాడు.

"ఒకడి పేగులుకోసి, మరోడి కురుపులు కడిగితే నెలయ్యేసరికి మహావస్తే ముప్టి మూడువేలు! అమెరికా వెళ్ళి ఫార్మకోసియా ఎమ్. డీ. అయి తింగొచ్చి మందులఫ్యాక్టరీ పెడితే, ఆర్నెల్ల కార్లక్షలార్జించొచ్చు" యిది జగపతి అభిప్రాయం.

తన ముందుజీవితం గురించి ఆనందరావింకా ఆలోచించలేదు. మందులకంపెనీ పెట్టినా, ప్రాక్టీసుపెట్టినా, అత నెలాంటివా డవుతాడన్న ప్రశ్నకి సమాధానం సులువుగా దొరకదు. అత నెలాంటివాడన్న ప్రశ్నకి, బహుశా అతనే చెప్పలేడేమో! అత నతి మంచివాడన్నా కావచ్చు. అతిచెడ్డ వాడన్నా కావచ్చు. అతనిలో చెడ్డతనముంటే అది యీ వేళ వరకూ బైటపడ్డేదు. అతని మంచితనానికి మాత్రం కొన్ని నిదర్శనాలున్నాయి. ఇచ్చిన అప్పు తీర్చమని అతనెప్పుడూ అడగడు. పక్క నెవరున్నా తన కారులో లిఫ్టిస్తాడు.

తోడున్న వాళ్ళెవరినైనా సరే తనతో సినిమాలకి, హోటళ్ళకి తీసుకుపోతాడు. మంచివాళ్ళ లిస్టులోనే స్నేహితులతన్ని వేస్తారు.

అతనిలోని మంచిచెడ్డలకు భీకర సంఘర్షణెప్పుడూ జరగలేదు. అతని జీవిత మంతేవరకూ కగగని కలలా ప్రశాంతంతా జరిగిపోయింది. అతని జీవితపు బాట ఒక్కకలరుది. ఫోంరబ్బరుది. దాంట్లో కళ్ళలో గుచ్చుకునే ముళ్ళూ, కాళ్ళు బద్దలుకొట్టే రాళ్ళూ లేవు. అతనికి జీవితమంటే, ఒంటరి కాంక్రీటు రోడ్డుమీద, రంగువెన్నెల్లో, అమెరికన్కారులో, ప్రియురాల్తో ప్రయాణంలాంటిది. అంచే తతనికి పాతమెరికన్ కుట్రల్లగాయతూ, నా రమెరికన్ కేన్ కేన్ వరకూ చాలా తెలిసినా, తన దేశంగురించే తనకి సమంగా తెలీదు.

పేదరికం, దరిద్రం; ఆకలి అనే పదాలకి అతని నిఘంటువులో స్థానంలేదు. అత నెక్కడికెళ్ళినా కారులో వెళతాడు. అతను వెళ్ళే యిళ్ళకి సెంట్రల్ జైలు గోడల్లాంటి ఎత్తయిన రాతి కాంపౌండు గోడలుంటాయి. ఆ యిళ్ళల్లో జూలులేని సింహాల్లాంటి అల్సేషియను లుంటాయి. ఆకాశంలో వేలాడుతున్నట్లుండే పోర్టికో లుంటాయి.

ఐనా అతనెప్పుడూ బీదరికం చూళ్ళేదనడానికి వీలు లేదు. ఒకనాడు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకు పోయినప్పుడు, తన షెవర్లెట్ రేర్‌వ్యూ మిరర్‌లో అతని కన్పించింది, ఏడుస్తున్న పిల్లనోట్లో ఎండిన రొమ్ము కుక్కుతున్న ఒకముష్టి తల్లి.

మరోనాడు సూపర్ మార్కెట్టుదగ్గర దిగి ఎర్ర స్పోర్ట్సుకారు తలుపు వేస్తున్నప్పుడు ఫ్రంటు మడ్‌గార్డులో కని పించాడో మొహం చిరిగిన ముష్టివాడు.

కాని వీళ్ళెవరూ అతన్ని బాధపెట్టలేదు. దేశం సుభి క్షం. కష్టపడే వాళ్ళందరికీ తిండుంది. వళ్ళువంచనివాళ్లే అడు క్కోవడానికి, దార్లు కాయడానికి సిద్ధపడతారు. మహా కావ లిస్తే మరికొన్ని ఫ్యాక్టరీలు పెట్టేస్తే చాలు—దరిద్రం జోలి కట్టుకుని పాకిస్తానో, చైనానో పారిపోతుంది. ఇవి అతని అభి ప్రాయాలు.

అతను కళ్ళారా ఒక్కనాడుమాత్రం దరిద్రాన్నీ, దరి ద్రుల్నీ చూశాడు. ఆవేళతని నాలుగో పుట్టినరోజు. ఆవేళా, ఆ ముందూ జగపతిగారు ఫూళ్ళోలేరు. అంచేత జగపతిభార్య పార్వతి చొరవచేసి బీదలకి సంతర్పణేర్పాటుచేసింది. సంత ర్పణ మధ్యాలో, మండుటెండలో తిరిగొచ్చేడు జగపతి. పోర్టి కోలో, కన్నతల్లిలా నిండుగా నవ్వుతూ, మెరుస్తున్న కళ్ళతో పార్వతి నిలబడుంది. ఆమెపక్కనే నిలబడిన ఆనందరావు, చిరి గిన అస్థిపంజరాలకు తోలు తొడిగినట్టున్న యిద్దరు ముష్టి పిల్లలు, దేవుడో దెయ్యమో వచ్చి తమ ముందున్న అన్నం లాక్కుపోతారేమో నన్నట్టు ఆత్రంగా అన్నం తింటుండడం చూస్తున్నాడు. ఆ ముష్టిపిల్లల పక్కనున్న ఆనందరావు, తోడేళ్ళ పక్కనున్న బొచ్చుకుక్క పిల్లలాగ జాలిగానూ, పార్వతి కళ్ళల్లో వెలుగు-చీకటిరాత్రి పులికళ్ళలో మెరుపు లాగ భయంకరంగానూ జగపతికి కనిపించేయి. దేశంలో ఆక

లంతా తమ కడుపుల్లోనే వున్నట్లు, ఆయాసపడేంత తొందరగా అన్నం తింటున్న కాంపౌండులోని ఋషివాళ్ళు, అతని కళ్ళకి మైక్రోస్కోపులోని జబ్బు పురుగుల్లా కనిపించేరు.

ఆ సంఘటన జగపతికి నచ్చలేదు. అత నెవ్వరితోను అనలేదు. కాని మళ్ళీ అటువంటి సంఘటనలు పీడకలల్లా తిరిగి రాకుండా కొన్ని కట్టుదిట్టా లతను చేశేడు. పార్వతిని భక్తి మార్గంలో పెట్టేసేడు. ఆనందరావుని కిండర్ గార్డెన్ స్కూల్లో పెట్టేసేడు. అందర్రాసిన భగవద్గీత వ్యాఖ్యానాలూ పార్వతికి కొన్నాడు. అన్నిరకాల బొమ్మల పుస్తకాలూ ఆనందరావుకి కొన్నాడు.

కిండర్ గార్డెన్ స్కూలు తరువాత కాన్వెంటులో చదివేడానందరావు. కాన్వెంటొదిలేసరికి ఆనందరావు చేతికి సిగరెట్టొచ్చింది. నోటికి బూతుల్తోసహా ఇంగ్లీషు ఝణ్ఝంగా వచ్చింది. తన హక్కులకోసం పోరాడంకూడా వచ్చింది. ఆనందరావు "లిటిల్ జంటిల్మన్" అవుతున్నందుకు జగపతి ఆనందించాడు.

* * *

పరీక్షలయ్యేక ఆనందరావు తన స్నేహితుడు రాజుతో సహా తనింటి కొచ్చేడు. రాజతని క్లాసుమేటూ, రూమ్మేటూ కూడా. అతనికి ముప్ఫైఎకరాల భూముంది. యశోదనబడే మంచి తల్లుంది. మంచివాళ్ళుగాని, చెడ్డవాళ్ళుగాని, అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళూ లేరు. అత న్నాన్నపోయి

ఎన్నాళ్ళోఐంది. అతనిది ఒక పట్టణానికి దగ్గరున్న ఒక పల్లె.

వారంరోజు లున్నాక ఆనందరావుని తనూ రాహ్వానించేడు రాజు. యశోద మళ్ళీ పెళ్ళి చేసుకునే ఉద్దేశంలో లేదనీ, పెళ్ళీడు ఆడపిల్ల లెవరూ వాళ్ళింట్లో లేరనీ యుక్తిగా తెలుసుకుని మరీ సమ్మతించాడు జగపతి ఆనందరావు వెళ్ళడానికి.

రాజుగా రూరొచ్చేక తను ప్రపంచంలో చూడవలసింది చాలా వుందనిపించిం దానందరావుకి. అలసిపోయిన మనసుకి చల్లగాలిలా కన్పించిందా పల్లె. కొత్తకోడళ్ళలా ఉత్సాహంగా గంతులువేసే బిగువురవికెల ఆడకూలీ లతనికి సంతోషం కలిగించేరు. అస్తమిస్తున్న చంద్రుడి క్కనిపించకుండా, పూలతోట నడుంచుట్టూ చెయ్యిచేర్చి, నిద్రపోతున్న ప్రియురాల్లావున్న ఏరు అతని పల్చని ఎముకల్లో కోరిక రేకెత్తించింది. తలంటుపోసుకున్న శ్రావణమాసం నోముల పెళ్ళికూతుళ్ళలావున్న కొబ్బరిచెట్లు అతనిలో కళాతృష్ణ పెంచాయి.

ఏతాం తొక్కుతున్న నాయుడి తడిసిన నల్లశరీరంలో సూర్యుణ్ని చూచినప్పుడూ, ఏతాంకింద, చీర మోకాళ్ళమీద కెగ్గట్టి కుడిచేత్తో గూనవేస్తున్న పిల్ల ఎడంచేత్తో తుడుచుకుంటున్న నుదుటి నీటి ముత్యాలు చూచినప్పుడూ అతనికి చిత్రకారుడ నవా లనిపించింది.

* * *

రాజింటినుండి కాలవొడ్డునే నడుస్తే నాలుగు ఫర్లాంగుల్లో పల్లె తగులుంది. పల్లెనిదాటి మరో నాలుగు ఫర్లాంగులు వెళితే రాజుగారి తోట వస్తుంది.

ఆ వూరొచ్చిన నాలుగోనాడు సాయంత్రం సినిమాలో హీరోతండ్రిలా ఊలుశాలువా కప్పుకొని "చలేస్తుంది బాబూ" అంటూ లాన్లో ప్లాస్టిక్ కుర్చీలో కూర్చున్నాడు రాజు. అతని కెదురుగా యశోదా, పక్కగా ఆనందరావూ రెండు కుర్చీల్లో కూర్చున్నారు.

శీతాకాలం సాయంత్రం ఎండ వెచ్చగా ఊలురగ్గులా వుంది. పక్కనే పున్నాగచెట్టునుండి రాలే పువ్వులు ఎండలో బంగారు పువ్వుల్లా వున్నాయి. ఎండ ఎర్రరంగులో, పంటబరువుకి వోరగా వాలిన చేలు బంగారంకాసి, దాని బరువుకి ఒరిగిపోయినట్టున్నాయి. ఎక్కణ్నించో ఆవుపెయ్యొకటి పరుగెత్తుకొచ్చి మెడ గోకమన్నట్టు యశోద దగ్గరకెళ్ళి మెడ చాపింది. యశోద దానిమెడ గోకుతూవుంటే, ఏ పాపమూ ఎరగసి పసిపిల్ల కళ్ళలా దానికళ్ళు నిండుగా, నిర్మలంగా, అమాయకంగా, నీరూరుతూ మెరిశాయి.

దేవుడు సృష్టించిన యీ ప్రపంచంలో లోటే లేనట్టుందంతా. ఈలోగా ఎనిమిదేళ్ళ పిల్లొకర్తె వచ్చి యశోద పక్కన నిలబడింది. దూరంనుండి చూస్తే తడిసిన కాకిపిల్లలా అసహ్యంగా ఉంది. సంవత్సరాలు తపస్సుచేసి పెంచిన బైరాగిజటల్లా ఆ పిల్లజుట్టు ఎక్కడికక్కడ పెనవేసుకు

పోయింది. జుట్టు మొహంచుట్టూ కప్పేయ్యడంవల్ల భయంలో కన్నంలోంచి చూస్తున్న ఎలక మొహంలా ఆ పిల్ల మొహం బెదురుతున్న కళ్ళతో వుంది. ఐనా అర్థంకా నాకర్షణతో ఆ పిల్ల పొలంగట్టున పూసి వాడిపోతున్న పిచ్చిపువ్వులా, బాధ కలిగించే అందంతో కూడుకొనుంది. ఆమెపక్కనే తేనెరంగు పట్టుచీర కట్టుకొని నిలబడున్న యశోద మొహం, తేనెరంగు గ్లాస్ ఫ్లవర్ వేజులో గుచ్చిన వాడబోతున్న గులాబీపువ్వులా వుంది.

ఆ(రోజుల)తె అన్నం మొహం ఎరగనట్టుందా పిల్ల. "డిసింక్టిలీ ఏన్ ఎడ్వాన్స్‌డ్ కేస్ ఆఫ్ మాల్ న్యూట్రిషన్" అనుకున్నా డానందరావా పిల్లని చూడగానే.

"ఎందుకొచ్చావ్ ?" అని యశో దాపిల్లని ప్రశ్నించి' "మా తోటమాలి కూతురు" అని ఎపోలెజిటిక్‌గా ఆనందరా వ్వేపు తిరిగి అంది.

"మా సెల్లికి జబ్బ సేసీసింది" అని, ఎవరైనా ఏమైనా అడుగుతారేమోనని ఆశించిన ట్టూరుకుంది ఆపిల్ల. ఎవరూ ఏమీ అడగ లేదు. అంచే తాపిల్లే అంది "అబ్బాయి గోర్నోపాలి అంపమన్నాది మా యమ్మ" అని.

అబ్బాయిగారివేపు చూసింది అమ్మ. "నా కొళ్ళు బాగాలేదు బాబూ" అన్నా డబ్బాయిగారు, అమెరికాకైనా తనప్పుడు రాలేనన్నట్టు మొహంపెట్టి.

రాజువైపు చూశా డానందరావు. అతను కాళ్ళు రెండూ ఎదురుగా టీపాయ్‌మీద పెట్టుకూర్చున్నాడు.

అతను టైట్‌గావున్న తెల్ల టెర్లిన్ పేంటు, షర్టులో, కాస్త పెద్దసైజుపొర తొడుక్కున్న నాగుపాములా వున్నాడు. అతని కాళ్ళకున్న ఎంబాసిడర్ జోడు అడుగు, తెరిచిన మొసలి నోర్లావుంది.

"నే వెళ్తా" అన్నా డానందరావు.

"నువ్వా?" తల్లీ, పిల్లడూ ఒక్కసా రాశ్చర్య పోయేరు.

"ఏం?" అన్నా డానందరావు రాజువైపు తిరిగి.

"ఏమో" చెప్పలేదు రాజు.

"బేగిరా బాబూ" తొందరచేసింది పిల్ల.

"మీ చెల్లి కేవిటి జబ్బు?" అనడిగే డానందరావు.

"వారంరోజులై ఒకటే యిరేసినాలు. ఆశారిగోరు మందియ్యడం మా నీసినారీ పొద్దు" అందా పిల్ల.

తనకు తోచిన మందులు జేబులో వేసుకుని బైల్దేరా డానందరావు. తోవలో నడుస్తున్నంతసేపూ ఎంతో ఆతృత పడ్డాడు. ఇది తన ఫస్ట్ కేస్. ఇది ఫెయిలవడానికి వీల్లేదు.

సూర్యాస్తమయమయ్యే సమయానికి పాముల్చేరిన పులిగుహలావున్న తోట చేరారు వాళ్ళిద్దరూ. రకరకాల శృతుల్లో ఏడుస్తున్న పురుగుల్తో ఆ తోట చూడ్డానికి భయంకరంగా వుంటుంది. ఆ తోటలో దట్టంగా పెరిగిన చెట్లన్నీ చేతుల్లావున్న తమ కొమ్మ లడ్డంగాచాపి ఎండనంతా ఆపేస్తున్నట్టున్నాయి. చెట్లకి దొరక్కుండా కిందకుజారిన ఎండ, అక్కడా అక్కడా పచ్చగా మచ్చల్లా పడడంవల్ల, ముదు

చుకు పడుకున్న మచ్చలపాములా వుంటుందా తోట పగటి పూట. ఇసక రేణువైనా కన్పించకుండా, పచ్చని పిచ్చి మొక్కలు పెరగడంవల్ల, నాచుతో కుళ్ళిపోతున్న మొసళ్ళ చెరువులా వుంటుం దితర సమయాల్లో. ఆ తోటలో ఒకవార ముసలి మర్రిచెట్టుంది. దాని మాను వాన కోసేసిన పాడు కోట బురుజులా వుంది. వేలాడుతున్న దాని వూడలు రాక్షసు లారేసిన చింకిగుడ్డల్లా వున్నాయి. ఆ మర్రిపక్కనే విరిగిన అగ్గిపుల్లల్తో చేసినట్టున్న ఒక పూరిగుడిసుంది. దాన్ని ఎన్నిసార్లు చూసినా, ఎంతసేపు చూసినా, పుస్తె అమ్ముకున్న పునిస్త్రీ మెడలో పసుపుకొమ్ముని చూసినట్టు బాధగానే వుంటుంది.

ఎంతవంగినా, ఆ గుడిసెలోకి వెళ్ళినప్పుడానందరావు తలకి చిన్న దెబ్బ తగిలింది. విరిగిన తడకల్తోటీ, చిరిగిన తాటాకుల్తోటీ చేసినట్టున్న ఆ గుడిసెలో కెళ్ళగానే, తనేదో మోసం చేసినట్టు ఫీలయ్యే డానందరావు. ఇంతదరిద్రం, ఇంత మంచిగా కనిపించే తన ప్రపంచంలోనే వుంటుందని అతనూహించలేకపోయేడు. చచ్చిన పాముల్లా, ఒక తడకకి రెండు ఏరంగువో తెలీని చింకిగుడ్డలు వేలాడుతున్నాయి. అస్తికలేరి న్నాడు కడిగేసిన శ్మశానంలాంటి కడిగిన పొయ్యి పక్కని రెండు బోర్లించిన కుండలుమాత్రం ఒకవార వున్నాయి. ఆ ఒంటిగదిలో మూలకున్న కిరసనాయిలు బుడ్డి నీరసపుకాంతి ఎర్రచీకటిలా వుంది. దీపం గాలికి కదిలినపుడల్లా చీకటి చలికి వణికినట్టుంటుంది.

ఒకమూల తాళ్ళు తెగిన నులక కుక్కిమంచంలో విరి

గిన బొమ్మలాంటి ఒక ఆరేళ్ళపిల్ల పడుకొనుంది. ఆరేళ్ళు కేవలం వాయుభక్షణం మాత్రం చేసినట్టుంది. ఏ క్షణాన్న తోలు చీల్చుకొని యెముకలు బైటకొచ్చేస్తాయో నన్నట్లు ప్రతిజాయింటు దగ్గరగా ఎముకలు సూదిగా కన్పిస్తున్నాయి. చేపల్లాంటి ఆ పిల్లకళ్ళు తెరచివుండటంవల్ల చచ్చి తేలిన ఎర్ర చేపల్లా వున్నాయి, కిరసనాయిలు బుడ్డీ ఎర్రకాంతిలో. పిల్ల కన్నూ ముక్కూ తీరుగావున్నా, ఆ పరిసరాల్లో పాడుగోడ మీద పుట్టిన పువ్వులమొక్కలా చూడ్డానికి బాధగావుంది. ముష్టి దానిముక్కున ముత్యపు ముక్కుపుడకలా పరిసరాలకు సరిపడకుండా, మంచం పక్కనే తెల్లగా తోమిన ఇత్తడి బిందొకటి వుంది. ఆ బిందె ఆ పిల్లతల్లి తెచ్చుకున్న అరణమేమోనన్న ఆలోచనరాగానే ఆనందరావుకి గుండె ఒక్కసారి ఆగినట్టయింది. ఆ బిందె పట్టుకొని కాపురానికొచ్చినప్పుడామెకున్న ఆశలు...

నశించిపోతున్నాశలా మంచం వారనే ఆ పిల్ల తల్లి నిల్చొనుంది. ఆమె కెన్నేళ్ళుంటాయి? ఎన్నున్నా నూరేళ్ళూ నిండిపోయినట్టుంది.

ఆలస్యం చెయ్యకుండా తననితాను పరిచయం చేసుకొని వెంటనే పరీక్ష ప్రారభించే డానందరావు. పేషంటు వళ్ళు బ్రతికుండగానే కాలిపోతున్నట్టు అతి వేడిగా ఉంది. పరీక్ష చేస్తున్నప్పుడు బలవంతంగా పక్కకి ఒత్తిగించినప్పుడాపిల్ల, పామునోట పడ్డ కప్పపిల్ల చివరి మూలుగులా మూలిగింది.

తన పరీక్షవల్లా, తల్లి చెప్పినదానివల్లా, పిల్లకి నెల్లాళ్ళయి టైఫాయిడ్, వారంరోజులై డయోరియా కాంప్లికేషననీ గ్రహించేడానందరావు. అదివరకు ఆ పిల్లకి ఆయుర్వేదం చేసినాచారి, ఆ పిల్లకి ఐదురోజులై యేటువంటి ఆహారం పెట్టనివ్వలేదుట.

పిల్ల బబ్బువల్ల కాకయినా, ఆకలికి చచ్చిపోయేట్టుంది. ఆ అమ్మాయికి వెంటనే పుష్టికరమైన ఆహారం యివ్వాలి.

"హార్లిక్సుగానీ, వోవల్టీనుగానీ, గ్లూకోజుగానీ వున్నాయా?" అని ఆ పిల్లతల్లి నడగడానికి నోర్రాలేదానంద రావుకి. ఏమనాలో తెలీక "వీళ్ళ తండ్రేడీ" అన్నాడు.

"జైల్లో బడేసినారు" అందామె.

"జైల్లోనా?" ఆశ్చర్య పడ్డాడానందరావు

కథ మామూల్దే. ఆ పిల్లతండ్రి ఐదు రోజులక్రిందట రిక్షా తొక్కడానికి పట్నం పోయేట్ట. రాత్రీపగులూ తొక్కి మూడ్రోజుల్లో పిల్ల మందుకి డబ్బు పట్టుకొస్తానని వెళ్ళాట్ట. ఒక రాత్రీ, ఒక పగలూ తొక్కేక, మరితొక్కలేక పాతలవాటు ప్రకారం సారా తాగేట్ట. తాగి పట్టుబడితే కేసు పెట్టేర.

"జరీమానా కట్టనేకపోతే జైలుక్కట్టేసినారు, రెండోరాలు" ముగించిందామె.

"పిల్లకేదేనా అర్జెంటుగా తింటానికివ్వాలి."

"బిందెలో నీల్లూ, బాందిలో పేనాలుతప్ప నాకాడేట్నవు" అంటూ, బిందెమూతతీసి గ్లాసుతో నీళ్ళు ముంచి

తీసిందామె. కన్నీళ్ళలా స్వచ్ఛంగావున్నాయి బిందెలో నీళ్ళు. కాని కొంచమే ఉన్నాయి. వీళ్ళ కడుపునిండా కన్నీళ్ళుకూడా వుండవా అన్పించిం దానందరావుకి ఏడవక పోవడం చూచి.

"యింకేఁవీలేదాః" అర్థంలేని ప్రశ్నేశాడు.

"కొంపలో గిద్దెడు గింజలుంటే నిన్న స పుకుతిన్నం తోట్టు" అంటూ ప్రారంభించిందామె తన కథ. జబ్బుపిల్ల నొదిలేసి తను కూలికి పోలేదట. మొగుడు చూస్తే జైల్లో కూర్చున్నాట్ట వాళ్ళకి రెక్కాడినా, పూర్తిగా డొక్కాడ దట. ఐదురోజులై ఆ జబ్బుపిల్లా, ఆ పిల్లతల్లీ ఏఁవీఁ తిన్లేదట. "ఆఖరికి యీ గుంటైనా మూడ్రోజులై మెతుకు ముడితే యీ గంగమ్మ తల్లిమీదొట్టు. తల్లీ, పిల్లలూ నాశనమై పోతామన్నమాట" అంటూ ముగించి గట్టిగా ఏడుపుకి తగులుకుంది.

"దేశంలో యింత దరిద్రమా?" అని బాధపడ్డా డానందరావు. తను నమ్మిన దేవుడు తనని మోసం చేసినట్టూ, తను పెంచిన పావురం పెనుపక్షై గోళ్ళతో తన పీక పట్టుకున్నట్టు ఫీలయ్యేడు.

"సర్లే, యింటికెళ్ళి మందులూ, పాలూ పట్టుకొస్తానుండు" అని ఆమెతో అని పెద్దపిల్లని తీసుకొని బయల్దేరేడు.

ఈ కేసు ఫేలవడానికి వీల్లేదు. ఇది తన మొదటి కేసు. తను ఎన్నాళ్ళనుండో కలలు కంటున్న ఫస్ట్ కేసు. ఇది డాక్టరుకి మొదటి కేసు. తొలివలపు లాటిది. డాక్టరు సున్నిత

హృదయుడైతే, అతని మనః ప్రవృత్తినే మార్చెయ్యొచ్చు ఆ కేసు. ఈ పిల్ల మందులేక ఛస్తే తనకి, తన వృత్తికి మాత్రమే అవమానం. కాని తిండిలేక చస్తే దేశానికి అప్రతిష్ఠ, మానవత్వానికే కళంకం. మనిషి రాక్షసుడన్న సత్యానికి ఋజువు. తను చెయ్యాని పాపమేదో తనని వెంబడిస్తున్నట్టు, తను చెయ్యాని తప్పు తనని వెక్కిరిస్తున్నట్టు ఫీలయ్యేడానందరావు.

"ఈ పిల్లలాంటి వాళ్ళెంతమందో..." పూర్తిగా విడివడని ఆలోచన మనసుని కోసినట్లయింది.

తోటబైట కొచ్చేసరికి అప్పుడే సూర్యాస్తమయం అవుతోంది.

తలదించి, శోకపైకెత్తి, బుసకొడుతూ పరిగెత్తేయమని ఎనుబోతు తన యినప డెక్కలతో లేపిన, యుద్ధరంగంలో రక్తంలో తడిసి ఎండి ఎర్రబారిన ధూళి పడమటాకాశంలో రేగినట్టుంది.

ఆ ఎర్ర బేక్‌గ్రౌండులో చావు చాపిన ఎముకల చెయ్యిలా వుంది వో మోడు బారిన చెట్టు.

రసినిండిన కురుపుల్లా వున్నాయి పల్లెలో మురికి గుంటలు.

పసిపాప సమాధిమీద లేచిన లేతగడ్డిలా జొడుకింద గడ్డి అతిమెత్తగా తగుల్తోంది.

◆ ◆ ◆

జోరుగా ఇల్లు చేరాడానందరావు. హాల్లో బ్లూలైటు వేసుకుని రాజూ, యశోదా కుర్చీలో కూర్చున్నారు. దూరం

నుండి చూస్తే ఆ హాలు నీలివర్ణంతో నిండి ఎక్వేరియం లాగా, అందులో వున్న యశోదా, రాజూ అడుగునున్న ఎఱ్ఱచేప ల్లాగా వున్నారు.

హాల్లో కొస్తూనే "అర్జంటుగా హార్లిక్స్ పెట్టించండి, ఆకలికి చచ్చిపోయేట్టుందా పిల్ల" అన్నాడానందరావు.

"ఆకలికా ?" అని ఆశ్చర్యపోయి, యశోద హార్లిక్స్ పెట్టి ఫ్లాస్కులో పోసి, మూణ్నిముషాల్లో వచ్చేసింది. కాని ఆ మూణ్నిముషాల్లోనూ రాజు పారేసిన మందుల బీరువా తాళాలు దొరకలేదు. మరో రెణ్నిమిషాల్లో కూడా దొరక లేదు. ఆ పిల్ల బతికుండగా దొరకవేమోనని భయపడి, ఆనంద రావు ఫ్లాస్కు ఆ పిల్ల చేతికిచ్చి, "నువ్వర్జంటుగా పరుగెత్తి కెళ్ళి మీ చెల్లికియ్యి. ఆలస్యం చేస్తే చచ్చిపోతుంది. నువ్వె ప్పంగెత్తు" అని ఆ పిల్లని పంపించేసి, మళ్ళీ తాళాల వేటలో పడిపోయేడు. తాళాలు దొరికేసరికి సరిగ్గా పదిహేన్నిముషాలు పట్టింది. తనక్కావలసిన మందులు తీసుకుని, సిరెంజి బోయిలు చేసేసరికి మరో ఐదునిముషాలు గడిచిపోయేయి. పక్క కళ్ళం పాకలో వున్న పాలికాపుని పిల్చి సాయమిస్తానని యశోదం టున్నా లక్ష్యపెట్టకుండా పరుగెత్తా డానందరావు, ఆలస్యమై పోతుందేమోనని.

తోవలో గజాలు గొలుసుల్లాగా, విఘడియలు ఘడి యల్లాగా కనిపించే యతనికి.

* * *

3)

అతను తోట చేరగానే, ఆ సమయంలో మనిషలికిడి అలవాల్లేసి పక్షులు కరకర అరిచేయి. గుడిసెకు దూరంగా వుండగనే, తను వెళ్ళడం అనవసర మనిపించిం దతనికి. పిల్లని బైటపడేశారు. ఆ పిల్ల తల దగ్గర హరికెన్ లాంతరెవరో పెట్టేరు. ఆ పిల్ల చుట్టూ పదిమంది దుప్పట్లు కప్పుకొని కూర్చున్నారు. వాళ్ళ తలలు మాత్రం బైటకుండడంవల్ల, వాళ్ళు దిక్కుమాలిన శవంచుట్టూచేరిన రాబందుల్లా వున్నారు. కొనాశతో నడిచివెళ్ళి వాళ్ళ పక్క నిలబడ్డా డానందరావు.

“పిల్ల పోనాది” అన్నారెవరో. పిల్ల మొహం మీదున్న దుప్పటి యెవరో ముసిల్ది తొలిగించింది. పిల్ల మొహం చుట్టూ దట్టంగా లాంతరు వెలుతురు పడ్డంవల్ల ఆహుతైపోయిన సెయింటు బొమ్మలావుందామె. కళ్ళుమాత్రం దేని కోసమో ఎదురు చూస్తున్నట్లున్నాయి. తర్వాత కళ్ళు మూసేసి దుప్పటి కప్పింది ముసల్ది.

సర్వం పోగొట్టుకున్న దాన్లా, ముణుకులమీద తల పెట్టుకుని కూర్చునుండాపిల్లతల్లి. ఆనందరావు వెళ్ళిపోబోతూ వుంటే ఆమె తలెత్తి చూసిందతనివైపు. ఆమె మొహమంతా కళ్ళే ఆక్రమించుకున్నట్టు వున్నాయి. ఒక కంట్లో నీటిబొట్టూరి, రెప్పమీద నిలిచి, లాంతరు యెర్రకాంతిలో కెంపులా మెరిసి, పైట తొలగిన ఆమె యెండుగుండె మీద పడి బద్దలైంది.

◆ ◆ ◆

తోట వదిలొచ్చేసినప్పుడు తన్లోని ముఖ్యమైన భాగాన్ని దేన్నో వెనక మరచిపోయినట్టు అనిపించిం దానంద

రావుకి. కాళ్ళు మొయ్యలేనంత బరువెక్కి పోయిం దతని మనసు.

తోట బైట కొచ్చేశా డతను.

విరిగిపోయిన పాలల్లావున్నాయి గుడ్డి చంద్రుని చుట్టూ తెల్ల మేఘాలు.

ఎత్తయిన చెట్లతో ఆ తోట పొగమంచులో పాడుపడ్డ కోటలా వుంది.

పల్లెలో గుడిసెలు కాలి ఆరిపోతున్నట్టు, ప్రతియింటి మీద వంటపొగ, మంచుబరువుకి నిలిచి పోయింది.

పల్లెలో మనుషులు పొగమంచులో ఆవిరై పోతున్న దయ్యాల్లా ఉన్నారు.

చిపికిపోయి నాలోచనలో యిల్లు చేరా డానందరావు. కాంపౌండు గోడ పట్టుమని పదిగజాలైనా లేదు. అప్పుడతనికి వినిపించిన భయంకర శబ్దానికి, కాళ్ళు సీలలువేసి భూమికి బిగించేసినట్టు నిలబడి పోయాడు. ఐదుతలలో ఆదిశేషుడు బుస కొట్టినట్లుంది. శబ్దం వచ్చినవేపు టార్చి వేశాడు. కళ్ళబడ్డ దృశ్యం గుండెను కంపించి వేసింది.

ఇందాకా ఫ్లాస్కు పట్టుకెళ్ళిన పిల్ల గోడకు గజం దూరంలో గోడవైపు మొహంపెట్టి పడుకొనుంది. బతికుండగానే కప్పేస్తున్నట్టు, ఎత్తుగా పెరిగిన గడ్డి, ఆ పిల్ల ఒళ్ళు సగం కప్పేసింది. ఆ పిల్ల వీపువెనక కసిగా పడగవిప్పి,. ఒక నల్లతాచు నిలబడి ఉంది. గడ్డిలో దానివళ్ళు కూడా కప్పబడి పోవడంవల్ల, భూమే పామై ఆ పిల్లని కరవబోతోందా అన్న

టుంది. ఆ పాము పొలుసులమధ్య పగుళ్ళలో విషం వూరుతున్నట్టు మెరుస్తున్నది దాని శరీరం. మనిషి మనసులోని అంధకారంలా అతినల్లగా ఉందది. ఘనీభవించిన గరళపు చుక్కల్లా మెరుస్తున్నాయి దానికళ్ళు. మనిషిలోని స్వార్థంలా ఎత్తుగా లేచింది దాని పడగ.

ఈలోగా అమాయకంగా పామువైపు ఒత్తిగిలిందా పిల్ల. మరో పాముని చూసినట్టయింది ఆనందరావుకి, ఆ పిల్ల వెనకాల రాతిపలకమీద పడుకోబెట్టిన ఖాళీఫ్లాస్కుని చూసినప్పుడు. ఫ్లాస్కు మూత తీసేసివుంది.

ఆకాశంలో కారుదున్నలు పరుగెడుతున్నట్టూ, తన కాలికింద సగంపడిన వానపాము వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టూ అనిపించిందానందరావుకి.

* * *

అమెరికా వెళ్ళి పై చదువుల్చదివి, తిరిగొచ్చి. మందుల కంపెనీపెట్టి, తనకక్కర్లేని లక్షలార్జించడవాఁ?

లేక

మురికిపేటలో ప్రాక్టీసు పెట్టి, లక్షలుగావున్న ఆ పిల్ల లాంటి పేదలకు సేవచెయ్యడవాఁ?

అనే

ఆనందరావు సమస్య ఆర్నెల్లలో అతనమెరికా వెళ్ళిపోవడం మూలంగా పరిష్కారమైపోయింది.